క్లుప్తంగా

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి కల్పించాలి

ఎల్.ఎన్.పేట: ఇప్పటికే 70 రోజులకు పైగా పనులు పూర్తిచేసిన జాబ్‌కార్డుదారులకు వంద రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆ పథకం ఏపీఓ వి.శ్రీదేవి సిబ్బందికి ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం ఉపాధి పథకం క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు చేపట్టాలని సూచించారు. మార్చి నెలాఖరు నాటికి వంద రోజులు పని కల్పించడమే లక్ష్యంగా తీసుకోవాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేయించాలన్నారు. కనీస దినసరి వేతనం రూ.270 గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు.

పంపిణీకి సిద్ధంగా.. యాజమాన్య ఆస్తి హక్కు పత్రాలు



తహసీల్దార్ కార్యాలయానికి చేరిన స్వమిత్వ ధ్రువపత్రాలు

సారవకోట: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన స్వమిత్వ సర్వేలో భాగంగా లబ్ధిదారులకు యాజమాన్య ఆస్తి ధ్రువపత్రాలు మంజూరైనట్లు తహసీల్దార్ భాగ్యవతి సోమవారం తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్వమిత్వ సర్వేలో భాగంగా గ్రామ కంఠంలో ఉన్న గృహాలు, దుకాణాలు తదితర భవన నిర్మాణాలకు ఆయా యాజమానులకు ఆస్తి ధ్రువపత్రాలు మంజూరయ్యాయన్నారు. వాటిని లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

శ్రీముఖలింగం ఉత్సవాలకు ఆహ్వానం



ధర్మాన పద్మప్రియకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వెంకటరమణ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాలకు కుటుంబ సమేతంగా రావాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సతీమణి పద్మప్రియను శ్రీముఖలింగం అర్చకులు ఆహ్వానం పలికారు. మబగాంలోని ఎమ్మెల్యే ఇంటికి ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవ వెంకటరమణ, అర్చకులు అప్పారావు, నారాయణమూర్తి తదితరులు సోమవారం వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు



పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ రామచంద్రరావు

ఆమదాలవలస రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరు చేయడం జరుగుతుందని సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అన్నారు. మండలంలో కట్యాచార్యులపేట గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు కొత్త ఫించన్లు మంజూరయ్యాయన్నారు. అర్హత ఉన్నవారు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మాన శేఖర్ మృతికి సంతాపం



ధర్మాన శేఖర్ (ఫైల్)

నరసన్నపేట: మండల కేంద్రంలోని పెద్దపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త, న్యాయవాది ధర్మాన వెంకటరమణ సోదరుడు ధర్మాన శేఖర్ (49) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈయన మృతి పట్ల ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. శేఖర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కృష్ణదాస్ పరామర్శించారు.

ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం

బూర్జ: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఐ.పావని అన్నారు. మండలంలోని అల్లెన గ్రామ సచివాలయం, అల్లెన గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 140 మంది రోగులకు వైద్య సేవలందించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, సుగర్‌తో బాధపడుతున్నవారి ఇళ్లకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. బూర్జ పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



చిన్నగుజ్జువాడలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని పలు అభివృద్ధి పనులు సోమవారం ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, గ్రామాల్లో స్వపరిపాలన దిశగా 2 వేల జనాభా కలిగిన దగ్గర సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇది వరకు మండల కేంద్రానికి వ్యయ, ప్రయాసలు పడి వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారని, ప్రస్తుతం గ్రామస్థాయిలో అన్ని పనులు జరుగుతున్నాయన్నారు. అంగూరులో రూ.18 లక్షలతో నిర్మించిన రహదారి, చిన్నగుజ్జువాడలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్, వాండ్రాయిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.21.8 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, రూ. 20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. గోవర్ధనపురం నుంచి వాబ వరకు రూ.50 లక్షల ఏఎంసీ నిధులతో నిర్మించనున్న రహదారి పనులకు, బొంతు జంక్షన్లో రూ.5 లక్షల ఐటీడీఏ నిధులతో నిర్మించనున్న ఆర్ట్ బజార్ పనులకు శంకుస్థపన చేశారు. ఈ కార్యక్రమంలో పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గొల్లంకి వెంకటరావు, జలుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొంగు కొండయ్య, సర్పంచ్ కొండాల బాబూరావు, ఇప్పి షణ్ముఖరావు, శంకరబాబు, బాడాన కృష్ణారావు, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, రావాడ భాస్కరరావు, రంజిత్, పల్లి కృష్ణారావు, నిక్కు రాజశేఖర్, మెండ రామకృష్ణ, కొండాల అర్జునుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వసపలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి, దేశంలోనే ఆదర్శంగా నిలిచారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. వసప గ్రామంలో ఎమ్మెల్యే సోమవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లల్లో పేద ప్రజలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరవేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పేద ప్రజలకు సీఎం జగన్ పలు సంక్షేమ పథకాల ద్వారా సకాలంలో లబ్ధి చేకూర్చడంతో టీడీపీ నేతలు తట్టుకోలేకపోతన్నారన్నారు. కొంతమంది టీడీపీ నాయకులు గ్రామాలకు వచ్చి మాయమాటలు చెప్పి ఓట్లు అడుగుతారని, అటువంటి వారి మాటలను నమ్మద్దన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కామక భాగ్యవతి, వసప సర్పంచ్ వలురౌతు ఆపీస్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి పంతులు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, రెడ్డి శ్రావణకుమార్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, వంబరవల్లి సూర్యనారాయణ, కలమట రమేష్‌బాబు, గార రాజులునాయుడు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పార్టీ మండల నేతలు పంకజ దాస్‌తోపాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శాంతారావు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు రెండో విడతకు సంబంధించిన నిధులు జమయ్యాయని, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ యు.శాంతారావు సూచించారు. హెచ్ఎంలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్ వచ్చిన మేరకు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పాఠశాలల్లోనే పోలింగ్ కేంద్రాలు నిర్వహిస్తున్నందున అన్నిచోట్ల మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, ర్యాంప్‌లు, లైట్లు, ఫ్యాన్లు, మంచినీరు ఉండాలని సూచించారు. మండలంలోని 83 స్కూళ్ల నుంచి హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

జలుమూరు: మండల పరిధిలోని పలు పంచాయతీల్లో అభివృద్ధి పనులు, భవానాలు, తాగునీటి పథకాలను నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ వాన గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైరిగాం పంచాయతీలో మంచినీటి పథకం, రావిపాడులో రైతు భరోసా కేంద్రం, తిలారు జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ వరకు నిర్మించిన బీటీ రోడ్డు, సచివాలయ భవనం, హెల్త్ సెంటర్, ఇంటింటికీ కుళాయిలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాలకు కార్పొరేషన్ చైర్మన్లు, డైరక్టర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఆమదాలవలసలో కార్డన్ సెర్చ్



మెట్టక్కివలసలో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్‌ఐ

ఆమదాలవలస: గ్రామాల్లో, వార్డుల్లో అపరిచిత, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆమదాలవలస సీఐ దివాకర్ సూచించారు. పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నివాసం ఉంటున్న వ్యక్తుల సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పూర్తి వివరాలు తెలుకుని ఇళ్లను అద్దెకు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతంలోని ఎటువంటి పత్రాలు లేని ఆరు వాహనాలను సీజ్ చేశారు. ఓ వ్యక్తి వద్ద తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఎస్ఐ కె.వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం



సభ్యులకు సూచనలిస్తున్న ఎంఎంఎస్ అధ్యక్షురాలు ధనలక్ష్మి

ఆమదాలవలస రూరల్: మహిళా సంఘాలతో ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకం అందజేస్తుందని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం సాగుపై మహిళా రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘాల్లో ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులకు అవసరమైన శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని తెలిపారు. దేశవాళీ అవుల పెంపకం, పశువుల పెంట గెత్తం, వర్మీ కంపోస్టుల వినియోగం ద్వారా పంటలను పండించి ప్రజల ఆరోగ్యానికి దోహదపడాలన్నారు. ఏపీఎం కూర్మారావు, క్లస్టర్ కో ఆర్డినేటర్లు రమణ, చందరరావు, సుభద్ర, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీని ఢీకొట్టిన లారీ



సంఘటన స్థలంలో ఉన్న లారీ

జలుమూరు: మండలంలోని చిన్నదూగాం పంచాయతీ పరిధి తిలారు జంక్షన్‌లో ఉన్న లక్ష్మీనరసింహ ఆలయ ప్రహరీని ఒడిశాకు చెందిన లారీ సోమవారం ఢీకొట్టింది. పాతపట్నం నుంచి నరసన్నపేట వైపు లారీ వస్తుందని పోలీస్‌లు తెలిపారు. ఈ ఘనటపై పోలీసులకు ఆలయ ఈఓ రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు. ఒడిశాకు చెందిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ మధుసూదనరావు తెలిపారు.

ఆలయాన్ని కూల్చివేతకు కుట్ర..

ప్రమాదం ముసుగులో ఆలయాన్ని కూల్చివేతకు కొంతమంది కుట్రపన్నారని గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జి. భార్గవి, ఫోరం ఫర్ సొసైటీ జస్టిస్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 2021లో రోడ్డు విస్తరణలో ఈ ఆలయం కూల్చకుండా ఉండేందుకు గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ హై కోర్టును ఆశ్రయించిందన్నారు. న్యాయ స్థానం కూడా ఆలయం కూలక్రకూడదని అధికారులకు ఆదేశాలిచ్చిందన్నారు. అప్పటినుంచి ఆలయం ఆస్తులను కాపాడటంలో గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. ఇది నచ్చని కొందరు వ్యక్తులు ఆలయాన్ని కూల్చేందుకే ఒడిశాకు చెందిన లారీతో ఢీకొట్టి కొంత భాగం ధ్వంసం చేశారన్నారు.

మంచినీటి ట్యాంక్ ప్రారంభం



కలిగాంలో మంచినీటి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు

కొత్తూరు: మండలంలోని కలిగాం గ్రామంలో మంచినీటి ట్యాంక్‌ను వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో ట్యాంక్ నిర్మించినప్పటికీ గత పాలకులు పట్టించుకోలేదు. ఈ విషయాన్ని సర్పంచ్ సనపల కోటేశ్వరరావుతోపాటు పార్టీ నాయకుడు కూన అర్జున, తదితరులు వైస్ ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వైస్ ఎంపీపీ స్పందించారు. మండల పరిషత్ నిధులతో పైప్‌లైన్‌ను తవ్వించి తాగునీటి సమస్య పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొమనాపల్లి గోవిందరావు, అచ్యుతరావు, అచ్చెన్న, అలికాన గోపాలరావు, సూర్యనారాయణ, కాంతారావు, రమణయ్య, కొత్తూరు మాజీ సర్పంచ్ లోతుగెడ్డ తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సాగుబడి.. చెరువులు బాగుపడి



గుర్రపుడెక్కతో నిండి ఉన్న పోలాకి శివాలయం కోనేరు



మత్స్యకారులు గుర్రపుడెక్క తొలగించిన అనంతరం శివాలయం కోనేరు



వైఎస్సార్ మత్స్యకార సాగుబడిలో చెరువులు లీజుకు పొంది లబ్ధిపొందుతున్న స్వదేశీ మత్స్యకారులు



గుర్రపుడెక్కను తొలగిస్తున్న మత్స్యకారులు

ఈ చిత్రంలో ఉన్న చెరువు పోలాకి మండల కేంద్రంలోని శివాలయం కోనేరు. వైఎస్సార్ మత్స్యకార సాగుబడి పథకంలో భాగంగా స్థానిక డోల-జనావానిపేట స్వదేశీ మత్స్యకార సంఘానికి మూడేళ్లపాటు అధికారులు లీజుకు కేటాయించారు. అప్పటివరకు గుర్రపుడెక్క పేరుకుపోయి, చెత్తాచెదాలతో ఉన్న కోనేరు ప్రస్తుతం ఇలా తయారైంది. దీంతోపాటు పోలాకి పంచాయతీ పరిధిలోని మరో మూడు చెరువులు కూడా మత్స్యకార సాగుబడి కింద పంచాయతీవారు లీజుకు ఇవ్వటంతో చెరువులు బాగుపడ్డాయి. స్థానిక మత్స్యకారులకు సైతం మంచి ఉపాధి లభిస్తోందని పోలాకి గ్రామ సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ హనుమంతు ఢిల్లీశ్వరరావు తెలిపారు. చెరువుల అభివృద్ధితోపాటు పంచాయతీకి సైతం ఆదాయం సమకూరడంతో ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. – పోలాకి

8న డీపీఎల్ సీజన్–5 క్రికెట్ టోర్నమెంట్



మాట్లాడుతున్న ఆర్ఎస్‌సీఏ ప్రతినిధులు

నరసన్నపేట: ఈ నెల 8న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ధర్మాన ప్రీమియర్ లీగ్ సీజన్-5 జిల్లా స్థాయి డేఅండ్ నైట్ క్రికెట్ టోర్నమెంట్‌ను శివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్నామని ఆర్ఎస్‌సీఏ ప్రతినిధులు ప్రకటించారు. ఆర్ఎస్ సీఏ ప్రతినిధులు పెదిరెడ్ల రాము, డేవిడ్, రమేష్, అనిల్, రాజశేఖర్, శ్రీను సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ టోర్నమెంట్ విధివిధానాలను తెలిపారు. మొదట వచ్చిన 32 టీమ్‌లకు టోర్నమెంట్‌కు తీసుకోనున్నామని, నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీలు 6 ఓవర్లు పాటు ఆడించనున్నామని తెలిపారు. ఎంట్రీ ఫీజు వెయ్యి రూపాయలు చెల్లించాలని, పోటీల్లో పాల్గొంటున్న వ్యక్తులు ఏదో ఒకే పంచాయతీ పరిధికి చెందినవారు అయి ఉండాలని, ఆధార్ జిరాక్స్ ఇవ్వాలన్నారు. ఆరో తేదీలోగా ఎంట్రీలు స్వీకరిస్తామని తెలిపారు. ఎంట్రీలు 80083 74884 నంబర్‌కు ఫోన్‌లో తెలపవచ్చన్నారు. టోర్నీ విజేతకు ట్రోఫీతోపాటు రూ.50 వేల నగదు బహుమతి, రన్నర్ టీమ్‌కు రూ.25 వేల ఇవ్వనున్నామన్నారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.5 వేలు, ఉత్తమ బ్యాట్స్‌మన్, బౌలర్‌కు చెరో రూ.2 వేల చొప్పున అందజేస్తామని తెలిపారు.


రైతు సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్ర చేసిన సమయంలో రైతుల సమస్యలను తెలుసుకున్నారన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత రైతును రాజును చేసేందుకు అనేక పథకాలు అమలు చేశారన్నారు. అప్పులు చేయకూడదనే ఆలోచనతో పెట్టుబడి సాయం అందిస్తున్నారన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో రైతు భరోసా–పీఎం కిసాన్ ద్వారా 39,344 మంది రైతులు రూ.7.87 కోట్ల లబ్ధి పొందారని తెలిపారు. హిరమండలం నుంచి 5,089 మంది రైతులు రూ.1.02 కోట్లు, కొత్తూరులో 11,102 మంది రైతులు రూ.2.22 కోట్లు, ఎల్.ఎన్.పేటలో 5,894 మంది రైతులు రూ.1.18 కోట్లు, మెళియాపుట్టిలో 8,611 మంది రైతులు రూ.1.72 కోట్లు, పాతపట్నంలో 8,648 మంది రైతులు రూ.1.73 కోట్లు లబ్ధి పొందారని వివరించారు. రైతు వద్దకే ప్రభుత్వ పథకాలను తీసుకురావాలన్న ఆలోచనతో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు ఇంటి వద్దకే అందిస్తు న్నామన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు



నరసన్నపేట: పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రశ్నపత్రాలను సరిచూస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

నరసన్నపేట: ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న టెన్త్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు సోమవారం నరసన్నపేట పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ, తిలారు, నరసన్నపేట మండలాల పరిధిలోని ఉర్లాం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నారాయణ, సెంట్ క్లైరెట్ కేంద్రాలకు చెందిన ప్రశ్నపత్రాలు వచ్చాయని ఎంఈఓ శాంతారావు తెలిపారు. మరికొన్ని కేంద్రాలకు సంబంధించి ప్రశ్నపత్రాలు రావాల్సి ఉందన్నారు. వచ్చిన మేరకు పోలీస్టేషన్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామన్నారు.

సారవకోట: స్థానిక పోలీస్ స్టేషన్‌కు తొలి విడత 10వ తరగతి ప్రశ్నాపత్రాలు సోమవారం చేరాయి. వీటిని ఎంఈఓ రమణ, పరీక్ష సిబ్బంది సమక్షంలో పోలీస్ స్టేషన్లోపి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. మండలంలో సారవకోట, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 10వ తరగతి పరీక్ష కేంద్రాలు మంజూరయ్యాయి. సారవకోట పరీక్ష కేంద్రంలో సారవకోట, అలుదు, చిన్నకిట్టాలపాడు, నవరబొంతు ఆశ్రమ పాఠశాల, నవతేజ పాఠశాలలకు చెందిన 276 మంది విద్యార్థులు, బుడితి ఉన్నత పాఠశాలలో 204 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈఓ తెలిపారు.



సారవకోట: పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

రూ.2 లక్షలతో వంటశాల నిర్మాణం



నిర్మాణం చేపడుతున్న వంటశాల

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయానికి వచ్చే భక్తుల కోసం పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తన సొంత డబ్బులు రూ.2 లక్షలతో వంటశాల నిర్మాణం చేపడుతున్నారని ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు సోమవారం తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రతీ మంగళవారం భోజనాలు తయారు చేయడానికి ఈ వంటశాల ఉపయోగంగా ఉంటుందన్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని కోరారు.